బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంత్యోత్సవాలను సనత్ నగర్ నియోజకవర్గంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, సమతావాదిగా ఆయన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు అభివర్ణించారు. సనత్‌నగర్, అమీర్‌పేట్, బేగంపేట్, రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్ డివిజన్లలోని నాయకగణం ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి, దళిత సంక్షేమానికి ఆయన చేసిన సేవలను పలువురు కీర్తించారు. కులరహిత సమాజం కోసం, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తనత జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు బాబూజగ్జీవన్‌రామ్ అని కొనియాడారు.


బేగంపేటలో..


బేగంపేట-బల్కంపేట లింక్‌రోడ్డులో..


సనత్‌నగర్‌లో...


అడ్డగుట్టలో ..


నార్త్‌లాలాగూడ శాంతినగరలో..


బాలంరాయిలో..


పికెట్ చౌరస్తాలో..

ఘంటసాల గొప్ప దేశ భక్తుడు


గాయకుడు రమణగొగణిని సన్మానిస్తున్న వంశీరామరాజు, రామసత్యనారాయణ

చిక్కడపల్లి: ఘంటసాల కేవలం సినీ గాయకుడు మాత్రమే కాదని ఆయన దేశ స్వాతంత్ర సంగ్రామంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించిన గొప్ప దేశ భక్తుడని సద్గురు ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్ స్థాపకుడు వంశీ రామరాజు అన్నారు. 'భారతరత్న' గా కేంద్ర ప్రభుత్వం ఘంటసాలను గుర్తించాలని ఆయన కోరారు. శుక్రవారం రాత్రి త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై రసనాథ క్రియేషన్స్ సరిగమ మ్యూజిక్ అకాడమీ నిర్వహణ ఘంటసాల శతజయంతి సందర్భంగా ప్రముఖ గాయకుడు రమణగొగణి గాయనీగాయకులతో కలిసి 101 ఘంటసాల పాటలు నిర్విరామంగా 12గంటలు పాడి శ్రోతల ప్రశంసలు పొందారు. ముఖ్యఅతిథిగా వంశీరామరాజు పాల్గొని ఉదయం తొలిపాట నుంచి చివరి 101 పాట వరకు రమణ గొంతులదే మాధుర్యం ఉట్టి పడిందని ఇది అపూర్వమని అభినందించారు.

- సద్గురు ఘంటసాల గాన రత్న బిరుదుతో రమణను సినీనిర్మాత రామసత్యనారాయణతో కలసి వంశీ రామరాజు సత్కరించారు. ఈ సందర్భంగా రమణకు అరుదైన గాన ప్రయోగం చేసినందుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రశంసాపత్రం అందజేశారు. సంఖ్యాక శాస్త్రజ్ఞుడు భాగ్యనగర్ బ్యాంకర్స్ గ్రూప్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు..



సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో .. టమాటా రూ.17, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 35, పందిరి బీర 28, క్యాబేజీ 18, క్యారెట్ 23, దొండ 23, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 50, గోకరకాయ 28, కీర 20, దోసకాయ 18, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 33, చామగడ్డ 35, మొరంగడ్డ 16, కందగడ్డ 65, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటు చేయాలి


పూజలు చేస్తున్న సమితి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: సికింద్రాబాద్ జిల్లాను ఏర్పాటు చేయాలని శ్రీ ఉజ్జయినీ మహాంకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం సికింద్రాబాద్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు. సికింద్రాబాద్‌లోని 7 అసెంబ్లీ నియోజక వర్గాలు త్వరితగతిన అభివృద్ధి చెందాలంటే జిల్లాను ఏర్పాటు చేయాలన్నారు. సికింద్రాబాద్‌ను జిల్లాగా ప్రకటిస్తే 1116 కొబ్బరికాయాలను కొట్టి మొక్కుతీర్చుకుంటామని అమ్మావారిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాల్‌రాజ్‌యాదవ్, శైలేందర్, కృష్ణముదిరాజ్, అశోక్, శ్రీకాంత్‌రెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

టీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉదయశ్రీ


ఉదయశ్రీరెడ్డి

కాచిగూడ: ప్రముఖ విద్యావేత్త ఇట్టా ఉదయశ్రీరెడ్డిని తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ (టీసీసీ) రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా నియమించినట్లు కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం బర్కత్‌పురలోని టీసీసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఉదయశ్రీరెడ్డి ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గత 20 ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణ, శాంతి, మతసామరస్యం, కేన్సర్, క్షయవ్యాధి నివారణ, గుండె జబ్బులు, చక్కెర వ్యాధి, హైపర్ టెన్షన్, జాతీయ సమైక్యత, విద్యార్థిని మహిళా సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు.

చిక్కడపల్లితో శాంతిస్వరూప్‌కు విడదీయని అనుబంధం


శాంతిస్వరూప్ (ఫైల్)

చిక్కడపల్లి: దూరదర్శన్ తొలితరం న్యూస్ రీడర్ శాంతిస్వరూప్ చిక్కడపల్లితో విడదీయరాని అనుబంధం ఉంది. 1980 దశకం ప్రాంతంలో ఆయన దాదాపు 30 ఏళ్ల చిక్కడపల్లిలోని తమ సొంతిట్లోనే ఉండేవారు. ఆయన విద్యాభ్యాసం కూడా ఇక్కడే ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాల ఆంధ్రా విద్యాలయంలో జరిగినట్లు తెలుస్తోంది. దాదాపు 2000 సంవత్సరం వరకు ఆయన చిక్కడపల్లిలోనే నివసించి అనంతరం రామాంతపూర్‌కు తరలివెళ్లారని స్థానికులు చెబుతున్నారు. ఆయన ఇటీవలి వరకు త్యాగరాయగానసభ సిటీ సెంట్రల్ లైబ్రరీలో జరిగే పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని సభకు అధ్యక్షత వహించి సభికులు, ప్రేక్షకులు, తోటి వేదికపైన ఉండే పెద్దలను కూడా ఆకట్టుకునేవారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌లో 'ఆకర్షణ'


ఆకర్షణకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సనత్‌నగర్: బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న 12 ఏళ్ల ఆకర్షణ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ప్రవేశించింది. ఈ మేరకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ న్యాయ నిర్ణేత డాక్టర్ దండి వసుధారాణిల చేతుల మీదుగా చిన్నారి ధ్రువీకరణ పత్రాలతో పాటు మెడల్‌ను అందుకున్నారు. చిన్నారి ఆకర్షణ ఇరుగుపొరుగు వారి నుంచి, పాఠశాల స్నేహితులు, కుటుంబసభ్యుల నుంచి సేకరించిన పుస్తకాలతో లైబ్రరీలను ఏర్పాటుచేసింది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి 25 లైబ్రరీల ఏర్పాటు పూర్తి చేసే లక్ష్యంగా పెట్టుకున్న చిన్నారి ఇప్పటివరకు 10 లైబ్రరీలను ఏర్పాటుచేసి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీలతో పాటు ఎందరో ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. 25వ లైబ్రరీ ప్రారంభానికి తాను కూడా వచ్చి చేరతానని ఇటీవల నగర పర్యటనకు వచ్చిన ప్రధానమంత్రి ఆమెకు హామీనిచ్చిన విషయం విదితమే.

లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందాం


సమావేశంలో మాట్లాడుతున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

సనత్‌నగర్: బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు అవిశ్రాంత కృషి చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు. పార్లమెంట్ పరిధిలోనే కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఆయనకు మంచి మెజార్టీ వచ్చేలా గెలిపించుకుందామని చెప్పారు. బేగంపేట డివిజన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థిని ఎమ్మెల్యే కృష్ణారావు కార్యకర్తలకు పరిచయం చేశారు. అనంతరం మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో ఎన్నో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, నాయకులు శ్రీహరి, రాజయ్య, యాదగిరిగౌడ్, సత్యనారాయణ, రఘునాథ్, సామల పాండు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వసంత్ కుమార్


బాధ్యతలు చేపడుతున్న సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

లక్డీకాపూల్: సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా వై. వసంత్ కుమార్ ఎన్నికయ్యారు. శుక్రవారం ఈ మేరకు ఆయన తన నూతన కార్యవర్గంతో బాధ్యతలు చేపట్టారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా జే.సుశీల్ కుమార్, ఉపాధ్యక్షులుగా టి.వి. రమణ, సంయుక్త కార్యదర్శిగా ఎం.బుచ్చి బాబు, కోశాధికారిగా కె. ప్రవీణ్ కుమార్, మహిళా ప్రతినిధిగా వి. పుష్పలత, లైబ్రరీ కార్యదర్శిగా జే. గంగాధర్, స్పోర్ట్స్ కల్చరల్ కార్యదర్శిగా బి. నవీన్ రెడ్డిలతో పాటు మరో ఐదుగురు కార్యవర్గసభ్యులుగా ఎన్నికయ్యారు.

ప్రమాదకరంగా మ్యాన్ హోళ్లు


బౌద్ధనగర్‌లో ప్రమాదభరితంగా మారిన మ్యాన్‌హోల్

బౌద్ధనగర్: బౌద్ధనగర్ ఉన్న మ్యాన్‌హోల్ గుంతలు వాహనదారులకు ప్రమాద భరితంగా మారాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా నడిరోడ్లపై హెచ్చుతగ్గులతో ఉన్న ఈ మ్యాన్‌హోల్స్‌తో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. డివిజన్‌లోని గాంధీ బొమ్మ తదితర ప్రాంతాల్లో జీహెచ్ఎంసికి చెందిన వరద నీటి పైప్‌లైన్‌లను అనుసంధానంగా ఉన్న మ్యాన్‌హోల్స్, జలమండలికి చెందిన మ్యాన్‌హోల్స్ ప్రమాద భరితంగా ఉన్నాయి. కొన్ని మ్యాన్‌హోల్స్ ఎత్తుగా, మరికొన్ని మ్యాన్‌హోల్స్ రోడ్డుకు చాలా తగ్గులో ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు వీటిని గమనించకుండా వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

నియామకం



కాచిగూడ: అంబేడ్కర్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా చేపూరి రాజును నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు హెచ్.ఫాస్మీ శుక్రవారం నియామకపు పత్రాన్ని అందజేశారు. రాజు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పార్టీ తెలంగాణ రాష్ట్ర బాధ్యతలు అప్పగించిన పార్టీ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హెచ్.ఫాస్మీ, కదీర్ అలీఖాన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో పార్టీ విస్తరణకు కృషి చేస్తానని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 17 ఎంపీ స్థానాల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు.

సాహిత్య అకాడమీకి పాలక మండలిని నియమించాలి

లిబర్టీ: తెలంగాణ సాహిత్య అకాడమీకి పాలక మండలి నియమించాలని అభ్యుదయ రచయితల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్.సూర్యప్రకాష్, ప్రధాన కార్యదర్శి గడ్డమీద చంద్రమోహన్‌గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అకాడమీకి పాలకమండలి లేనందున సాహిత్య కార్యకలాపాలు నిర్వహించడం లేదన్నారు. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... రచయితలు, కవులు సంబంధించిన సమస్యలతో పాటు రచనలను, సాహిత్యాన్ని ప్రొత్సహించాలంటే తప్పనిసరిగా చైర్మన్ నియమించాల్సిన అవసరం ఉందన్నారు. కవులు, రచయితలకు అవార్డులు ఇవ్వడంతో పాటు వారిని ప్రొత్సహించాలని కోరారు. సాహితవ్యరంగాన్ని పటిష్ట పరచాలని రాష్ట్ర ప్రభుత్వం సాహిత్య విధానాన్ని ప్రకటించాలని కవులకు, రచయితలకు ప్రత్యేక ప్రభుత్వం పక్షాన అవార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

7న సామూహిక నిరాహార దీక్ష: ఆప్

లిబర్టీ: ప్రజాస్వామ్యంలో నియంతృత్వ ప్రధాని నరేంద్రమోదీ భయాకన రాజకీయ అణచివేతలకు పాల్పడుతున్నారని, బీజేపీ రాజకీయ హింసపై దేశంలో తీవ్ర ప్రజా ప్రతిఘటన తప్పదని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ హెచ్చరించారు. లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఏప్రిల్ 7వ తేదీన నిర్వహించే ఆప్ సామూహిక నిరాహార దీక్ష పోస్టర్‌ను రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాముగౌడ్, మహిళా విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హేమ జిల్లోజు, నర్సింగ్ యమునగౌడ్, దివ్యాంగ విభాగం కన్వీనర్ దర్శనం రమేష్, టి.రాకేష్‌సింగ్, కొడంగల్ శ్రీనివాస్, శివాజీ, మౌనికలతో కలిసి డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాజకీయ ప్రతీకారం తీర్చుకోవడానికి నిరాధారమైన కేసులు బనాయించి ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కుంభకోణం కేసులో ఇరికించారని ఆరోపించారు. కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తు ఇందిరాపార్కు వద్ద ఏప్రిల్ 7న సామూహిక నిరాహార దీక్ష నిర్వహిస్తామన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు


కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్న సికింద్రాబాద్ బీఆర్ఎస్ నాయకులు

చిలకలగూడ: సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గాంధీభవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రతినిధి తిరుపతన్న, టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్ కుమార్, సీనియర్ నాయకుడు గౌరీశంకర్‌ల నేతృత్వంలో కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త జలంధర్‌రెడ్డి, నాయకులు వినోద్, నిర్మల్‌కుమార్, విష్ణు, ప్రవీణ్, జాక్, జాషువ, రమేష్, రామాంజనేయులు తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే, పార్లమెంట్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు అనుచరులు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో రాజకీయవర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

ఓబీసీ సెంట్రల్ కమిటీ స్టేట్ కన్వీనర్‌గా సైదులు


నియామకపత్రాన్ని అందజేస్తున్న భాగ్యలక్ష్మి

కాచిగూడ: ఓబీసీ సెంట్రల్ కమిటీ దళిత విభాగం తెలంగాణ స్టేట్ కన్వీనర్‌గా సైదులును నియమించినట్లు ఓబీసీ సెంట్రల్ కమిటీ జాతీయ చైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు కాచిగూడలోని ఓబీసీ సెంట్రల్ కమిటీ కార్యాలయంలో సైదులకు ఆమె నియామకపత్రాన్ని అందజేశారు. మహిళా బిల్లులో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అగ్రకులాల పేదలకు సబ్ కోటా కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి ఆమె విజ్ఞప్తి చేశారు. మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటాను కల్పించాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు టికెట్లు కేటాయింపులో బీసీ మహిళలకు అన్యాయం చేశాయని విమర్శించారు. ఓబీసీ సెంట్రల్ కమిటీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలిగా బాలినేని లక్ష్మికి ఈ సందర్భంగా నియామకపత్రాన్ని అందజేశారు.

నిరంకుశ పాలనకు చరమగీతం

ప్రొఫెసర్ కోదండరాం


కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ కోదండరాం తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పదేళ్ల నిరంకుశ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో “టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్”(ఐఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి పదవీవిరమణ సందర్భంగా అభినందనసభ జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో అన్ని వ్యవస్థలు నష్టపోయాయని అందులో ఆర్టీసీ కూడా ఆర్థికంగా నష్టపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఆరు గ్యారంటీ పథకాల ద్వారా ప్రజల్లో మంచి గుర్తింపును తెచ్చుకుంటుందని అభిప్రాయపడ్డారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, రాష్ట్ర నాయకులు ఆర్.డీ.చంద్రశేఖర్, మదర్‌డైరీ మాజీ ఎండి యుగేందర్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, అబ్రహం, గోపాల్, సాయిరెడ్డి, వీ.ఎస్.గౌడ్, కె.రాజలింగం, అంబటి నాగయ్య తదితరులు పాల్గొని రాజిరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు.

కార్మిక వర్గ పక్షపాతి కిరణ్‌కుమార్


సంతాపసభలో నివాళులర్పిస్తున్న పోటు రంగారావు తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కార్మిక వర్గ పక్షపాతి కిరణ్‌కుమార్ అని సిపిఐఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. కార్మికులు, కర్షకుల కోసం నిరంతరం పోరాటం చేసిన గొప్ప నాయకులని కొనియాడారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐఎఫ్‌టీయూ, తెలంగాణ ప్రొగ్రెసివ్ ఆటో అండ్ మోటర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కిరణ్‌కుమార్ సంతాప సభను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆటో, మోటర్ వర్కర్స్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఆర్టీఓలను సైతం నిలదీసి ఆటో వర్కర్స్‌ల సమస్యలను పరిష్కరించారన్నారు. యూనియన్ అధ్యక్షుడు ప్రవీణ్, మాస్ లైన్ కార్యవర్గ సభ్యులు కె.రమ, ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, మాస్‌లైన్ గ్రేటర్ కార్యదర్శి ఎం.అన్వేష్, ఐఎఫ్‌టీయూ హైదరాబాద్ అధ్యక్షులు ఎస్.ఎల్.పద్మ, లింగంగౌడ్, అనురాధా, నరేందర్, ఎస్.రవీందర్, జి.ఝాన్సీ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

ఫోన్ ట్యాపింగ్‌పై సమగ్ర దర్యాప్తు చేయాలి

తెలంగాణ న్యాయవాదుల జేఏసీ


మాట్లాడుతున్న నాగుల శ్రీనివాస్ యాదవ్

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై సమగ్ర దర్యాప్తు చేసి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర డీజీపీకి వినతి పత్రాలను సమర్పించామని జేఏసీ నాయకులు తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాసాయాదవ్, కన్వీనర్ బత్తుల కృష్ణలు మాట్లాడుతూ... రాష్ట్రంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారవేత్తలు, సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, పౌరులపై కూడా ఫోన్ ట్యాపింగ్ పాల్పడిన వారిపై సమగ్రంగా విచారణ జరిపించాలని కోరారు. ఆర్టికల్ 27 వ్యక్తిగత స్వేచ్ఛ. దీనిని దుర్వినియోగం చేయరాదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని ఆరోపించారు. రాష్ట్రంలో జరిగే 17 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. జేఏసీ నేతలు జి.విజయకుమారి, జి. రామారావు, అనురాధ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.